

ప్రియుడి మోజులో భర్త హత్య

● రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య యత్నం ● కేసును ఛేదించిన మేడికొండూరు పోలీసులు

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద నీరు

● దిగువకు 6,53,828 క్యూసెక్కులు విడుదల ● కొనసాగుతోన్న రెండో ప్రమాద హెచ్చరిక

4లో..

పింఛను పండుగ!

● పంపిణీకి సర్వం సిద్ధం

● దివ్యాంగుల పింఛన్లలో తొలగింపు లేదు



నరసరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముందే.. పింఛన్ల పండగొచ్చింది. జిల్లాలోని పింఛను దారులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు అందజేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి మూ డు జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పింఛను నగదు మొత్తాన్ని ప్రభుత్వం సచి వాలయ సిబ్బంది ఖాతాలో జమ చేసింది. మంగళవారం సాయంత్రానికే సచివాలయ సిబ్బంది నగదు డ్రా చేసి.. పంపిణీ సిద్ధం గా ఉంచుకున్నారు. బుధవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు.

● తొలి రోజే 95 శాతం

గుంటూరు జిల్లాలో 2,54,290, పల్నాడు జిల్లాలో 2,73,150, బాపట్ల జిల్లాలో 2,27411 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరందరికీ వలంటీర్లు లేకపోయినప్పటికీ తొలిరోజే పింఛన్లు అందజేస్తున్నారు. మూడు జిల్లాల్లో సచివాలయ సిబ్బంది తొలి రోజునే 95 శాతం పింఛన్లు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుదారులు అందరికీ దసరా ముందురోజే పింఛను నగదు అందనుంది. ప్రతి నెలా ఒకటవ తేదీ పండగ, ఆదివారం, సెలవు దినం ఉంటే ఒక రోజు ముందుగానే పింఛన్ల నగదును ప్రభుత్వం అందజేస్తోంది. గురువారం దసరా పండుగ కావడంతో ముందు రోజు లబ్ధిదారులకు పింఛను నగదు అందనుంది.

● దివ్యాంగులకు యథాతథం

బోగస్ దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,279 మందిని అనర్హులుగా గుర్తించింది. వీరిలో కొంతమంది అర్హులు కూడా అనర్హత బారిన పడడంతో గత నెల ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో వారికి కూడా కిందటి నెల యథాతథంగా పింఛన్లు అందజేశారు. ఈ నెల కూడా వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వారికి కూడా పింఛన్లు అందజేయనున్నారు.

● అందరికీ పింఛన్లు: డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రతి లబ్ధిదారునికి ఒకటో తేదీనే పింఛన్‌ను అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఆ రోజు ఎవరైనా అందుకోలేని పక్షంలో ఆందోళన పడాల్సిన పనిలేదు. వారికి మూడో తేదీ నుంచి యథావిధిగా పింఛన్లు అందజేస్తాం. దివ్యాంగుల పింఛన్లలో ఎలాంటి తొలగింపు లేదు. వారికి కూడా ఈనెల పింఛన్లు అందజేస్తున్నాం.



వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

● అక్రమాలను నిగ్గుతేల్చేందుకు చర్యలు

● విచారణాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఢిల్లీరావు

● త్వరగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు

● ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ చరిత్రలో తొలిసారి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సీనియర్ ఐఏఎస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావును విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం విడుదలైన ఈ ఉత్తర్వుల్లో విచారణ త్వరగా ముగించి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్, కర్నూలు జిల్లాకు చెందిన అడ్వకేట్.. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మిపై చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనుంది. ఇన్‌చార్జి వీసీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, బెదిరింపుల అంశాలపై విచారణ జరిపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మసక బారిన ప్రతిష్ట

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, రాజకీయాల వల్ల ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్ట క్రమేపీ మసక బారుతోంది. విశ్వ విద్యాలయం చరిత్రలో ఏనాడూ ఇలా సీనియర్ ఐఏఎస్‌తో విచారణ జరిగిన సందర్భం లేదు. మొట్ట మొదటి సారి భారీ విచారణకు ప్రభుత్వం ఉపక్రమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య (మిగతా 4వ పేజీలో)

చట్టానికి పాతర..

యూనివర్సిటీ చట్టంలో ఫైనాన్స్ కమిటీ (ఆర్థిక కమిటీ) లేకుండా నిధులు డ్రా చేయకూడదని స్పష్టంగా ఉంది. యూనివర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే రూ.వందల కోట్ల నిధుల వినియోగం అంతా కూడా ఫైనాన్స్ కమిటీ కనుసన్నల్లోనే జరగాలి. గడచిన రెండేళ్ల నుంచి అలాంటి కమిటీ లేకుండానే నిధులు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు ఇంత వరకు ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు చేయక పోవడంపైనే చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనివర్సిటీ చట్టం ప్రకారం ఖచ్చితంగా ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలక మండలి సమావేశం నిర్వహించాలి. కానీ ఐదుగురు సభ్యులతోనే మమ అనిపించారు.



నడికూడి రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం పరిశీలన

దాచేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నడికూడి రైల్వే జంక్షన్‌ను మంగళవారం గుంటూరు డీఆర్ఎం సుదేష్ణ సేన్ పరిశీలించారు. రేపల్లె పాసింజర్‌లో గుంటూరు నుంచి ఆమె స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాట్‌ఫాంపై చెల్లాచెదురుగా పడి ఉన్న ఇనుప ముక్కలను ఒక క్రమ పద్ధతిలో ఉంచాలని ఆదేశించారు. స్థానిక అధికారులతో మాట్లాడి పలు అంశాలపై వివరాలు సేకరించారు. మిర్యాలగూడ సమీపంలోని థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు వద్దకు వెళ్లారు.

విద్యుత్ కొరత తీరేలా!

● సాగర్‌కు వరద ప్రవాహం

● కుడి కాల్వకు నీటి విడుదల

● 104.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి

● రాష్ట్రానికి విద్యుత్ అందించడంలో కీలకం

● మార్చి వరకు ఉత్పత్తి కొనసాగే అవకాశం

కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. రికార్డు స్థాయిలో నాగార్జునసాగర్‌కు 6.17 లక్షల కూసెక్కుల వరద ప్రవాహం ఉంది. నది పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద నీటితో నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా తొణికిసలాడుతోంది. జూలైలో ప్రారంభమైన వరద ఇప్పటికీ కొనసాగుతోంది. సాగు నీటి సరఫరా కుడి కాల్వలో పుష్కలంగా జరుగుతోంది. ఒక వైపు పంటలతో ఆయకట్టు కళకళ లాడుతోంది. సాగు నీరు అందిస్తూనే పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుత్ కొరతను సాగర్ కుడి కాల్వ తీరుస్తోంది. రోజూ 104.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి జూలై చివరి వారం నుంచి కుడి కాల్వకు నీరు విడుదల చేస్తున్నారు. దాదాపు రెండు నెలలుగా పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. కుడిగట్టు మీద ఉన్న జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడ ఉన్న మూడు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90 మెగా వాట్లు కాగా, ప్రస్తుతం రెండు యూనిట్ల ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. 1.55 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు సంబంధిత అధికారి రాజారెడ్డి తెలిపారు. కుడి కాల్వకు 9,533 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూడో యూనిట్ ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. కుడి గట్టు కేంద్రాల ద్వారా జరిగే విద్యుత్ రాష్ట్రానికి వస్తుంది. మార్చి వరకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుంతుందని అంచనా.

27 ప్లాంట్లు.. 44.25 మెగావాట్లు

జలాశం నుంచి కుడి కాల్వకు విడుదల చేసే నీటితోనే విద్యు త్ ఉత్పత్తి చేస్తు న్నా రు. కుడి కాల్వ పరిధిలోని వివిధ కాల్వలపై 27 జల విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం 44.25 మెగావాట్లు. ఈ ప్లాంట్ల ద్వారా రోజుకు 9.55 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడి కాలువకు నీటి సరఫరా ఉంటే చాలు ఈ ప్లాంట్లు అన్ని విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి.

బ్రాంచ్ కెనాల్స్‌లో విద్యుత్ ఉత్పత్తి..

గుంటూరు బ్రాంచ్ కెనాల్స్ పరిధిలో 22.9 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 14 విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 8(16.7 మెగా వాట్లు), బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 2.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు, ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై 1.5 మెగావాట్ల సామర్థ్యం కలిగినది ఒకటి, జూలకట్లు బ్రాంచ్ కెనాల్‌పై ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ఒక ప్లాంట్ ఉంది. సాగర్ కుడి కాల్వ పరిధిలోకి అయా కాలువలపై విద్యుత్ కేంద్రాల ద్వారా మొత్తం 104.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై విద్యుత్ ప్లాంట్

6.17 లక్షల కూసెక్కుల నీటి విడుదల

సాగర్ జలాశయం నిండుకుండలా ఉంది. నీటి నిల్వ పూర్తి స్థాయి చేరింది. జలాశయానికి 6.17 లక్షల కూసెక్కుల వరద ప్రవాహం ఉంది. అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. సోమవారం 298.42 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులు కాగా 584.30 అడుగుల నీటి మట్టం ఉంది.



కాట్రపాడులో కృష్ణమ్మ పరవళ్లతో నీట మునిగిన వరి పొలాలు

312 ఎకరాల వరి పంట కృష్ణార్పణం

దాచేపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీర ప్రాంతంలో ఉన్న వందల ఎకరాల మాగాణి వరి పంట ఏటి పాలైంది. మండలంలోని నది ఒడ్డున ఉన్న పొందుగుల, రామాపురం, కాట్రపాడు, భట్రుపాలెంలో 312 ఎకరాల వరి పంట నీట మునిగింది. కృష్ణమ్మ ఆగ్రహానికి గింజ పాలు పోసుకొనే దశలో నీటిపాలైందని రైతులు అంటున్నారు. ఇప్పటి వరకు రైతులు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టు బడులు పెట్టారు. 40 రోజుల్లో పంట చేతి కొస్తుందని వారి ఆశలపై.. ప్రకృతి విపత్తు నీరు చల్లింది. నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రైతులందరూ ఈ-క్రాపు నమోదై ఉన్నారని తెలిపారు.

దుర్గా మాతా పాహిమాం..

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి పర్వదినం అమరేశ్వరాలయంలోని బాల చాముండికా అమ్మ వారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం కుంకుమార్చన నిర్వహించారు. బుధవారం మహార్నవమి పురస్కరించుకుని సాయంత్రం 7గంటలకు చండీ కల్యాణం జరుగుతుందని దేవస్థాన ఈఓ రేఖ తెలిపారు.



దుర్గాదేవిగా బాలచాముండికా అమ్మవారు

కొత్త ఉపాధ్యాయులకు ఐదు చోట్ల శిక్షణ

శిక్షణ అంశాలను విడుదల చేసిన విద్యాశాఖ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఐదు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జోన్-3 పరిధిలో 1,600 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలలో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

శిక్షణ కేంద్రాలు ఇవే..

నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజి, బూరనపేట ప్రగతి భవన్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. వినుకొండ సమీపంలోని వివేకానంద బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ (ఉర్దూ, ఇంగ్లిష్), ఫిజిక్స్, గణితం అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజ్ వైశ్య భవన్‌లో(రావిపాడు రోడ్డు) సెకండరీ గ్రేడ్ టీచర్స్ (తెలుగు, ఉర్దూ మీడియం) అభ్యర్థులకు శిక్షణ తరగతులుంటాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ అభ్యర్థులకు గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాల (సాంబశివపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు)లో శిక్షణ ఇస్తారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురు (పాత ఎన్‌బీటీ ఎన్.టి.ఆర్ కాలేజ్) శిక్షణ అందిస్తారు.

తరగతులు ఇలా..

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అధ్యాపకులన సిద్ధం చేశారు. తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం విద్యా బోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధివిధానాలు, చట్టాలు, పిల్లలతో బాధ్యతాయుత ప్రవర్తన, కేంద్ర, రాష్ట్ర విద్యా విధానాలు, విద్యాభివృద్ధి పథకాలు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం, సృజనాత్మకత ఆకలింపు, విద్యా బోధనలో సాంకేతికత తదితర అంశాల్లో నూతన ఉపాధ్యాయుల శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగానికి ఎంపికైన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాల్సిందేనని, ఎవరికి ఇందులో మినహాయింపు లేదని డీఈఓ సీవీ రేణుక స్పష్టం చేశారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రులు

● పలు ఆలయాల్లో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రులు పలు దేవాలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవిగా, శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గజలక్ష్మీదేవిగా, కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో దుర్గాదేవిగా అలంకరించారు. గుత్తికొండ బిలంలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని దుర్గా దేవిగా అలంకరించారు. గంగమ్మతల్లి దేవాలయం, బొడ్రాయి సెంటర్‌లోని మహాలక్ష్మమ్మ దేవాలయం వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు నిర్వహించారు. నాగుల గుడి, శివాలయం, బ్రహ్మంగారి గుడి, షిరిడీ సాయి మందిరం, భగవాన్ సత్యసాయి దేవాలయంలో అమ్మవార్లకు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● మాచర్ల రూరల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వేంచేసియున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మంగళవారం శ్రీమహాకాళిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● కారంపూడి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కారంపూడిలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అంకాళమ్మ అమ్మవారు కూడా దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● అచ్చంపేట : అచ్చంపేటలోని సీతారామస్వామి దేవాలయంలో 9వ రోజు అమ్మవారిని ధాన్య లక్ష్మీదేవిగా అలంకరించారు. అచ్చంపేట పంచాయతీలోని చామర్రు గ్రామంలో రూరల్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. మాదిపాడు వద్ద శారదాంబ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

● మాచవరం : మండలంలోని మోర్జం పాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయం భ్రమ రాంబ అమ్మవారిని మంగళవారం దుర్గాదేవిగా అలంకరించారు. మాచవరం ఆర్య వైశ్య కల్యాణ మండపంలో వాసవి అమ్మవారిని దుర్గాదేవిగా, మాచవరం చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో భ్రమరాంభ అమ్మవారిని దుర్గాదేవిగా, చెన్నాయపాలెంలోని రేణుకా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. తంగెడ గ్రామ పురోహితులు జానపాటి సీతారామశర్మ పూజలు నిర్వహించారు.

● నకరికల్లు : నరసింగపాడులోని గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో గంగా అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను, అలంకారాలను ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాస శర్మ నిర్వహించారు. చేజర్లలోని గంగా భ్రమరాంబ పార్వతి సమేతకపోతేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో గంగా భ్రమరాంబ పార్వతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను, అలంకారాన్ని ఆలయ ప్రధాన అర్చకస్వామి కొండ కావూరి వెంకట్రామయ్య శర్మ నిర్వహించారు.

● రెంటచింతల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా మంగళవారం శ్రీవాసవి, సత్రశాల భ్రమరాంబ, జంక్షన్ వద్ద కనకదుర్గ అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ చౌడేశ్వరీ, రామాలయం, ఉష్టస్తంభాల సెంటర్లలో నవరాత్రుల శోభ సంతరించుకుంది. మండపాలు వేసి బతకమ్మ ఆట, కోలాటాలు, కూచిపూడి, భరత నాట్యాలను ప్రదర్శిస్తున్నారు.


పిడుగురాళ్ల : కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు


మాచర్ల : శ్రీమహాకాళిదేవిగా శ్రీవాసవీ అమ్మవారు


నకరికల్లు : దుర్గాదేవి అలంకారంలో గంగా అన్నపూర్ణాదేవి

● క్రోసూరు : మండలంలోని క్రోసూరు, అనంతవరం గ్రామాల్లో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వాసవి అమ్మవారు దుర్గాదేవిగా, అనంతవరంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో దుర్గా అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు. వాసవి మాతను దుర్గాదేవిగా అలంక రించారు.

● కారంపూడి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శరణవ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు కజ్జం ప్రసాద్ పర్యవేక్షణలో పూజారి దీపాల మల్లికార్జునరావు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ వద్ద జరిపిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● పెదకూరపాడు : మండలంలోని పలు గ్రామాల్లో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

● బెల్లంకొండ : బెల్లంకొండ శ్రీ మహాలక్ష్మిదేవి ఆలయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో శ్రీ మహాదుర్గా అమ్మవారిగా మహాలక్ష్మీదేవి దర్శనమిచ్చారు. అమ్మవారికి రాత్రి విశేషార్చన, జాగరణ సంకీర్తన జరుగుతున్నాయి. బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు సుమారుగా రెండు వేల మందికి అన్నదానం చేశారు.

● నకరికల్లు : నరసింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక ప్రయోజనం


జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు వివరిస్తున్న గ్రామ కార్యదర్శి కృష్ణ

విజయపురిసౌత్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. దుర్గిలో వ్యాపార సంస్థల యాజమాన్యంకు జీఎస్టీ తగ్గింపుపై మంగళవారం ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేందుకు జీఎస్టీ తగ్గింపు దోహదపడుతుందన్నారు. గ్రామ కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనాలు పంపిణీ


పల్లెకారులకు భోజనాలు పంపిణీ చేస్తున్న చిత్రం

దాచేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నది పొంగి ప్రవహించటంతో నిరాశ్రయులైన పల్లెకార్లకు అల్పాహారం, భోజనాలను సాగర్ సిమెంట్ యాజమాన్యం అందజేస్తుంది. గత నాలుగు రోజులుగా నదీ ప్రవాహంతో నివాసం గృహాలను ఖాళీ చేసి రామాపురం ఉన్నత పాఠశాలలో తలదాచుకుంటున్న 60 కుటుంబాలకు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజనం, వసతులను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఆర్ఐ శరత్ బాబు, వీఆర్‌వో నాగేశ్వరరావు, ఆంధ్రా సిమెంట్ ప్రతినిధులు హెచ్ ఇన్‌చార్జ్ మణిప్రసాదు, శంకర్ నారాయణరెడ్డి, రామకృష్ణ, కూటమి నేతలు వేముల వినోద్‌రెడ్డి, రాఘవరెడ్డి ఉన్నారు.

చాగల్లులో బతుకమ్మ ఉత్సవాలు


చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ

నకరికల్లు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చాగల్లులోని గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు బతుకమ్మను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు బతుకమ్మ ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. మంగళవారం గంగా పార్వతి అమ్మవారిని, బతుకమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పాటలు పాడుతూ కోలాట ప్రదర్శన చేస్తూ బతుకమ్మ పాటలతో శరన్నవరాత్రి ఉత్సవాలను జరుపుకున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్‌పి స్కూల్ సమీపంలో ఉన్న ఓ చికెన్ షాపులో పని చేసే ఇరువురు యువకుల మధ్య మంగళవారం గొడవ జరిగింది. కేవలం 100 రూపాయల పంచాయితీలో ఇరువురి మధ్య జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఈ గొడవలో రియాజ్ అనే యువకుడు జానీబాషాపై కత్తితో దాడిచేయగా గాయాలయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో జానీ బాషా చికిత్స పొందాడు.

విశిష్ట అధ్యాపక పురస్కారానికి ఎంపికైన శ్రీనివాసరెడ్డి

పెదకూరపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విశిష్ట అధ్యాపక పురస్కారానికి మండలంలోని 75 తాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. అక్టోబరు 5వ తేదీన మచిలీపట్నంలోని మహతీ లలితా కళావేదికలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్టు ఆయన వివరించారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా దుర్గారావు బాధ్యతల స్వీకారం


దుర్గారావును సన్మానిస్తున్న చిత్రం

మాచర్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాచర్లకి చెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు మంగళవారం విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలు దుర్గారావును దుశ్శాలువాలతో సన్మానించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట

పెదకూరపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వ పాలనలో పెద్ద పీట వేస్తూ వారి ఆరోగ్య భద్రతకు ముందడుగు వేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు మాట్లాడుతూ మహిళల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ మండల శ్రేణులు భాష్యం ఆంజనేయులు, మద్దినేని వెంకట సత్యనారాయణ, పరుచూరి పూర్ణచంద్రరావు, ఉప సర్పంచ్ జాగర్లమూడి రఘు, భావన రాంబాబు, గోగులపాటి శ్రీను, గుడిపూడి బాబూరావు, నందిగామ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

● బొలేరో వాహనంతో స్కూటీని ఢీకొట్టి లాక్కెళ్లిన వైనం


స్కూటీని ఈడ్చుకెళుతున్న బొలేరో వాహనం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి యువకులు రోడ్ల మీద చేస్తున్న హంగామాకు హద్దుపద్దు లేకుండా పోతుంది. ఫూట్‌గా మద్యం తాగిన యువకుడు పిడుగురాళ్ల బైపాస్‌లో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో నానా హంగామా సృష్టించాడు. పిడుగురాళ్ల మార్కెట్ యార్డు సమీపంలో జరిగిన ఈ ఘటనలో సుమారు మూడు వాహనాలను ఢీకొని దూసుకుపోయింది. ఒక స్కూటీని బొలారో వాహనంతో ఢీకొట్టటమేకాక దాన్ని చాలా దూరం లాక్కుంటూ వెళ్లాడు. గమనించిన తోటి ప్రయాణికులు కేకలు వేసినప్పటికీ అంతే లాక్కుంటూ వెళ్లటంతో దారి పొడవునా స్కూటీ రోడ్డు మీద పడిన రాపిడికి నిప్పులు భీకరంగా వెదజల్లాయి. ఎట్టకేలకు వాహనదారులు వెంటబడి బొలేరో వాహనం నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గురజాలటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జంగమహేశ్వరపురం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఝాన్సీ అన్నారు. స్వస్థ నారీ - స్వశక్తి అభియాన్‌లో భాగంగా జంగమహేశ్వరపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

రేబిస్ వైరస్‌పై ప్రజల్లో అవగాహన అవసరం

క్రోసూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు జంతువుల ద్వారా వ్యాపించే రేబిస్ వైరస్‌పై ప్రజల్లో అవగాహన అవసరమని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. రేబిస్ వ్యాధి వారోత్సవాల సందర్భంగా సోమవారం ఆయన క్రోసూరులో మాట్లాడారు. రేబిస్ వ్యాధి పెంపుడు జంతువుల లాలాజలం ద్వారా వ్యాపిస్తుందన్నారు. కుక్క కరిచిన వెంటనే వైరస్ శరీరంలోకి ప్రవేశించకుండా వేడి నీటితో కడగాలన్నారు. వెంటనే టెట్‌వాక్ ఇంజక్షన్ చేయించుకోవాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను వ్యాక్సిన్‌లు సిద్ధంగా ఉంటాయని, వెంటనే వేయించుకోవాలని తెలిపారు.

రేపు బ్రహ్మం చౌదరికి అభినందన సభ

మాచవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరికి గురువారం తన సొంత గ్రామమైన మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్టు మాజీ సర్పంచ్ బండ్ల నరసింహారావు మంగళవారం తెలిపారు. బ్రహ్మం చౌదరికి ఇటీవల రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి వచ్చిన విషయం పాఠకులకు విదితమే. మండల పరిధిలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

కుంకలగుంటలో శ్రీ సత్యసాయిబాబా శత జయంతి

నకరికల్లు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుంకలగుంటలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి బాబా సేవా మందిరంలో మంగళవారం 65వ రోజు బాబా జయంతి నిర్వహించారు. తోటి మానవుల పట్ల ప్రేమ, జాలి, కరుణ కలిగి ఉండాలని, ఆయన చూపిన మార్గం నేటితరం అనుసరించాలని సత్యసాయి సేవా సమితి భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాళ్ళబండి కృష్ణంరాజు ఆధ్వర్యంలో భజన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సాయినాథునికి పట్టువస్త్రాలు సమర్పణ


కారంపూడి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయదశమి రోజున సాయినాథుడు సమాధి చెందిన సందర్భాన్ని పురస్కరించుకొని కారంపూడిలోని శ్రీషిర్డి సాయినాధుని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆర్యవైశ్య సంఘ నేత ఆతుకూరి భాస్కర్ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆటో, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

ఈపూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆటో, కారు ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని కూచినపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. బొల్లాపల్లి మండలం లాలిపురం తండాకు చెందిన నాయక్ ఆటోతో వినుకొండ వైపు వెళుతుండగా, కారంపూడి వైపు వెళుతున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి, ఆటోలో ఉన్న నాయక్‌కు గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న వ్యక్తిని వినుకొండ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు.



నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి, ఆటోనగర్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఉప్పలపాడులో ప్రతిపాదిత ఆటోనగర్ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అభ్యర్థలు చేశారు. ఆటోనగర్ స్థల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల ద్వారా సహకారం అందించాలన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమైందన్నారు. స్థానిక ఆటో రిక్షా డ్రైవర్లు, మెకానిక్‌లు, చిన్న వ్యాపారులకు ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం వంటి రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలకు డీఎంఎఫ్ నిధులను ఉపయోగించాలని కోరారు. పల్నాడు జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నందున ఈ నిధులు స్థానిక ప్రజల సంక్షేమానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఈ అభ్యర్థనలకు వేగంగా చర్యలు తీసుకుంటామని, డీఎంఎఫ్ నిధుల వినియోగంలో నియోజవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ఎమ్మెల్యేను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మంగళవారం కలిశారు. జీఎస్‌టీ శ్లాబ్ తగ్గించడం వలన వినియోగదారులకు కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు. అనంతరం జాయింట్ కమిషనర్ పీ జాన్‌స్టీవెన్‌సన్, నరసరావుపేట సీటీవో ఎం.రామారావును కలిశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వనమా సాంబశివరావు, కార్యదర్శి పచ్చిపులుసు సతీష్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడుకోటలో సీడ్ బాల్స్ చల్లిన గ్రీన్ వారియర్స్

యడ్లపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం గ్రీన్ వారియర్స్ ఆధ్వర్యంలో మండలంలోని కొండవీడుకోట ఘాట్ రోడ్డు, కొండలపైన సీడ్‌బాల్స్ చల్లే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ హితం, పచ్చదనం పెంపుదల లక్ష్యంగా పనిచేస్తున్న ఈ బృందం కోటప్పకొండ తదితర ప్రాంతాలలో కొనుగోలుచేసి తెచ్చిన మర్రి, చింత, తుమ్మ, తురాయి, రామాఫలం, సీతాఫలం వంటి విత్తనాలను సారవంతమైన ఎర్రమట్టితో 500 సీడ్ బాల్స్‌ను తయారుచేసింది. అటవీశాఖ అనుమతితో వలంటీర్లు, గ్రీన్ వారియర్స్ సభ్యులు కొండవీడుకోట పరిసరాలలో సీడ్‌బాల్స్‌ను చల్లారు. ఈ సందర్భంగా గ్రీన్ వారియర్స్ సభ్యులు ఫ్రాన్సిస్, ఝున్నుసాహెబ్‌లు మాట్లాడుతూ అంతరించిపోతున్న జీవజాలాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. దీనిలో భాగంగానే తమ సంస్థ ద్వారా పర్యాటక ప్రదేశమైన కొండవీడుకోట ప్రాంతంలో సీడ్ బాల్స్‌ను వేయడం జరిగిందన్నారు. సీడ్ బాల్స్ వలన పచ్చదనం పెంపొందించడమే కాకుండా అటవీ సంపదను వృద్ధి చేసుకోవడం సాధ్యమవుతుంని, దీనివల్ల జంతుజాలానికి రక్షణ సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ వారియర్స్ సభ్యులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తంరాజు, సహాయ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో అత్యంత ముఖ్యమైన రోజుగా భావించే మూలా నక్షత్రం రోజున, అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లిన చీఫ్ విప్ జీవిని ఆలయ అర్చకులు సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. చీఫ్ విప్ జీవీ వెంట నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ







రాజధాని లే అవుట్లు ఇలాగేనా!



- రాజధాని రైతుల్లో పొడ చూపుతున్న ఆగ్రహం
- హడావిడిగా దిద్దుబాటు చర్యలకు దిగిన సీఆర్డీఏ
- వర్షాల్లో, బురదలో లే అవుట్లలో పనులకు శ్రీకారం
- వాహనాల తొక్కిడితో లే అవుట్లలో భూమి ఛిద్రం
- బెడిసి కొడుతున్న దిద్దుబాటు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల లే అవుట్ల విషయంలో కొత్త సమస్య తలెత్తింది. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా తమకు ప్లాట్లు సిద్ధం చేసి ఇవ్వలేదని భూములిచ్చిన రైతులు ఒక్కొక్కరుగా రోడ్డు మీదకు ఎక్కుతుండడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా హడావుడిగా లే అవుట్లు సిద్ధం చేయడానికి అధికారులు కుస్తీలు పడుతున్నారు. అయితే లే అవుట్లలో చేపడుతున్న పనుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో లే అవుట్ల వ్యవహారం పీటముడిలా మారుతోంది.

ఏడాదిన్నరపాటు మీనమేషాలు లెక్కబెట్టారా?

రాజధాని కోసం తాము భూములు త్యాగం చేసి 11 ఏళ్లవుతున్నా ఇంత వరకూ తమకు

● ఏడాదిన్నరపాటు ప్లాట్లు ఇవ్వకుండా ఏం చేస్తున్నారు?

రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వకపోవడమేంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014-19కి ముందే తమకు ఇవ్వాల్సిన ప్లాట్లు ఇచ్చి ఉంటే గత వైసీపీ ప్రభుత్వం తమను వేదనకు గురి చేసేది కాదని రైతులు వాపోతున్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకైనా తమకు ప్లాట్లు వస్తాయని ఆశిస్తే అది ఇప్పటి వరకు నెరవేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అయితే సీఆర్డీఏ అధికారుల నిర్వాకంతో వ్యవహారం మొత్తం బెడిసి కొడుతోంది.

● హడావుడిగా పనులు.. గుల్లవుతున్న నేల

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తమకు ప్లాట్లు రాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్న విషయం సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని పురపాలకశాఖ, సీఆర్డీఏకు సూచించారు. దీంతో సీఆర్డీఏ హడావుడిగా వెలగపూడి, లింగాయపాలెం గ్రామాల్లోని లే అవుట్లలో పనులు ప్రారంభించింది. అయితే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల మధ్య భారీ ప్రొక్లెయినర్లతో దిగి కంప చెట్ల తొలగింపుతోపాటు, లే అవుట్లలో అంతర్గత రోడ్లు వేసేందుకు మట్టి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వర్షాల్లో ఈ పనులు చేపట్టడం కారణంగా లే అవుట్లలో మొత్తం నేలంతా గుల్లయిపోతోంది. రోడ్డు వేయడం కోసం రెండడుగుల మేర గుంతలు తీశారు. ఈ గుంతల్లో ఒక పొర కంకర, మరో పొర గులకరాయి వేసి, ఆ తరువాత రోడ్డు వేయాల్సి ఉంటుంది. అయితే ఈ గుంతలు వర్షాకాలంలో తీయడంతో వాటిలో నీరు చేరింది. దీంతో మళ్లీ నీళ్లు తోడుకోవడం పనిగా మారింది. ఇలా అర్థరహితంగా చేపడుతున్న పనుల కారణంగా లే అవుట్లు దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వంపై కూడా భారం పడుతోంది.

● ఈ దఫా అయినా వచ్చేనా..!

ఇదిలా ఉంటే రాజధాని రైతులకు ప్లాట్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం రైతుల్లో భయాందోళనలకు దారితీస్తోంది. ఈ దఫా అయినా తమకు ప్లాట్లు ఇస్తారో లేదోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్లాట్లు సకాలంలో ఇచ్చి ఉంటే రాజధానిలో ప్రభుత్వ భవనాలతోపాటు, ప్రైవేటు భవనాల నిర్మాణం కూడా సమాంతరంగా సాగుతుందని, అది రాజధాని సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్లాట్లను సరైన రీతిలో సిద్ధం చేసి తమకు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..



- ఘనంగా బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సరిహద్దు మండలాల్లో కోలాహలం

దాచేపల్లి/దుర్గి సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు విడిపోయినా ప్రజల మధ్య ఉన్న ఆచారాలు, సాంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బతుకమ్మ అంటే గుర్తు వచ్చేది తెలంగాణ రాష్ట్రం. తెలంగాణకు సరిహద్దు మండలం దాచేపల్లిలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. మహిళలు బతుకమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. తెలంగాణకు చెందిన ఆడ పిల్లలను ఈ ప్రాంత వాసులకు ఇచ్చి పుచ్చుకోవడం సంవత్సరాల తరబడి జరుగుతుంది.అప్పటి నుంచే ఈ ప్రాంతంలో బతుకమ్మను దేవీ నవరాత్రుల్లో భాగంగా చేసి పూజలు చేస్తారు.

ఏడు కోటలతో వెంపలి చెట్టుకు

పుట్ట మన్నుతో నాగ పడిగ ఆకారంలో ఏడు కోటలను నిర్మించి అందులో వెంపలి చెట్టును ఉంచుతారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి రోజుకొక పిండి వంటలను తయారు చేసి నివేదన చేస్తారు. పెళ్లికాని ఆడ పిల్లలు, సంతానం లేని వారు, సౌభాగ్యం కోరుకొనే మహిళలు అమ్మవారికి ఈ పది రోజుల పాటు పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారు. వాడవాడలా చిన్నారులు బతుకమ్మను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దసరా పండుగ రోజు పది రోజుల పాటు పూజలందుకున్న బతుకమ్మను గ్రామానికి సమీపంలో ఉన్న వాగులు, చెరువులు, కుంటలో నిమజ్జనం చేస్తారు. ఈ నిమజ్జన కార్యక్రమానికి మహిళలంతా పెళ్లి కుమార్తెను అత్తవారింటికి పంపించేటప్పుడు సారె ఇచ్చినట్లు.. చీర, చలిపిండి, పూలు, గాజులు, పండ్లు బతుకమ్మకు అందజేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు. ఈ పది రోజుల పాటు ఈ ప్రాంతంలో కోలాహలంగా ఉంటుంది. మహిళలంతా ఒక యూనిట్‌గా ఏర్పడి వీధుల్లోనే బతుకమ్మను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. మగవారు ఈ పూజా కార్యక్రమాలకు తమ వంతుగా సహకరించి అమ్మవారికి కృపకు పాత్రులవుతుంటారు. తెలంగాణ పద్ధతిలోనే బతకమ్మను పలురకాల పూలతో అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పల్లె పల్లెన బతుకమ్మ సంబరాలు..

దసరా పండుగ వచ్చింది.. వస్తూనే బతుకమ్మ సంబరాలను తెచ్చింది. నిన్నా మొన్నటి వరకు పట్టణాలకే పరిమితమైన బతుకమ్మ ప్రస్తుతం పల్లెలోనూ సందడి చేస్తోంది. మండల కేంద్రమైన దుర్గితోపాటు ఓబులేశునిపల్లె, అడిగొప్పుల, ముటుకూరు, ధర్మవరం వంటి పల్లెల్లో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను చేసి ఊరేగిస్తున్నారు. చిన్నారులు, యువతులు కోలాటాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికం, సాంప్రదాయ మేళవింపుగా దుర్గి మండల పరిధిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బతుకమ్మలను పురవీధుల్లో ఊరేగించి దేవాలయాల్లో కొలువుదీరుస్తున్నారు. దేవీ శరన్నవరాత్రులు ముగింపు రోజున బతుకమ్మలను కుడికాలవలో వదలనున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్థులు ఐకమత్యంతో బతుకమ్మ ఊరేగింపులో పాల్గొంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు.



దుర్గిలో బతుకమ్మ ఊరేగింపు ముందు చిన్నారుల కోలాటం

పంచాయతీల్లో అక్రమాలకు చెక్..!

- దొంగబిల్లులతో ఖజానా ఖాళీకి అడ్డుకట్టు
- స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా పాలన కొనసాగింపు

వినుకొండటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నులతో పాటు ప్రతి పైసాకు జమా ఖర్చులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగిస్తోంది. పంచాయతీ పాలన పారదర్శకంగా ఉండేందుకు నూతనంగా స్వర్ణ పంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిధుల వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ యాప్ సత్ఫలితాలను ఇస్తుంది. ఇక నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చులు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 13,344 గ్రామపంచాయతీల్లో ఈ యాప్ ద్వారా పారదర్శక పాలన అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది.



పల్లెల్లో ప్రజలు నివాస గృహాల, ఇతర గృహాల, తాగునీటి పన్నులను సరిగా చెల్లించేవారు కాదు. చెల్లించిన నగదుకు లెక్కలు ఉండేవి కాదు. అందిన కాడికి దోచుకునే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. గుండుసూది మొదలుకొని పొరకల కొనుగోలు వరకు జమా ఖర్చులకు ప్రతిపైసా పారదర్శకంగా ఉండేలా స్వర్ణపంచాయతీ విధానం తీసుకొచ్చింది.

● 'స్వర్ణ పంచాయతీ'తో ఉపయోగాలు

స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులోకి వస్తే ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా పన్నులన్నీ డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. ఇంటి పన్నుల చెల్లింపులు, బాకీలను డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. డబ్బు నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. అలాగే పంచాయతీలు ఖర్చు చేసే ప్రతిపైసా వివరాలు పారదర్శకంగా ఉంటాయి. ఈ యాప్ అందుబాటులోకి వస్తే కార్యదర్శులు లెక్కలు చెప్పాల్సిందే. కొనుగోళ్లను యాప్ ద్వారా నమోదు చేయాలి. దొంగబిల్లుల చెల్లింపులు అరికట్టవచ్చు. ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదు కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. గ్రామీణ ప్రజలు ఇంటి నుంచి సేవలు పొందవచ్చు. రశీదు, లావాదేవీల వివరాలు ఎప్పుడైన చూసుకోవచ్చు. స్వర్ణ పంచాయతీ యాప్ డిజిటల్ రికార్డులను సులభతరం చేస్తుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.



జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిదుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.





నేడు ఎమ్మెల్యే యరపతినేని రాక

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పలువార్డులలో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు. ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీ అనంతరం జిఎస్‌టి తగ్గింపుపై కలిగే ప్రయోజనాల సమావేశంలో పాల్గొననున్నట్లు నాయకులు తెలిపారు.

నేడు నకరికల్లులో కన్నా పర్యటన

నకరికల్లు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :నకరికల్లులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ బుధవారం పాల్గొననున్నారు. అనంతరం నకరికల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకట్రావు ప్రమాణస్వీకారంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

షిర్డి సాయిమందిర్‌లో మూలవిరాట్‌కు పాద నమస్కారం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ షిర్డి సాయి మందిరంలో బాబా పుణ్యతిథిని పురస్కరించుకొని దేవీనవ రాత్రులలో భాగంగా స్వామివారి మూలవిరాట్‌కు పాదనమస్కారం చేసుకునే అవకాశం ప్రతి ఏడాది విజయదశమి రోజున కల్పిస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ శ్రీరాం వెంకట శ్రీనివాసరావు తెలిపారు.

మహా ప్రస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కాండ్రు కాశయ్య


కాండ్రు కాశయ్య

క్రోసూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని మహా ప్రస్థానం అభివృద్ధి కమిటీకి నూతన పాలక వర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బండారు రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బద్దిగం హనిమిరెడ్డి, ఉప కార్యదర్శిగా అనుమాల పూర్ణచంద్రరావు, కోశాధికారిగా గోగిశెట్టి సాంబశివరావు ఎంపికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా యంపటి సాంబశివరావు, కర్నాటి కృష్ణారావు, జొన్నవరపు విజయ సారథిరెడ్డి, తెల్లమేకల అంజిరెడ్డి ఎంపికయ్యారు. దాతల విరాళాలతో అన్న ప్రస్థానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు అధ్యక్షుడు కాండ్రు కాశయ్య తెలిపారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కేసులు

నకరికల్లు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడీఈ బి.వెంకటేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. నకరికల్లు మండలంలో సోమ, మంగళవారాల్లో 11 లక్షల విద్యుత్ బకాయిలను వసూలు చేసినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులను గుర్తించి సరఫరాను నిలిపివేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగించే వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు భారీ అపరాధ రుసుం జరిమానాగా విధిస్తామన్నారు.

అవివాహిత అదృశ్యం

రెంటచింతల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన అవివాహిత సోమవారం నుంచి అదృశ్యమైంది. తల్లి సిద్దెల చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రెంటచింతల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై సోమవారం రాత్రి అత్యాచారయత్నానికి పాల్పడిన వేల్పుల నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

పొలాల్లోకి కృష్ణా నది వరద నీరు

● నీటిలో నానుతున్న మిర్చి, పత్తి పంటలు


గింజుపల్లి వద్ద కృష్ణానది వరదలో చిక్కుకున్న మిర్చి పైరు

అచ్చంపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనేక గ్రామాల్లో కృష్ణా నది వరద కారణంగా మిర్చి, పత్తి పొలాలు నీటిలో నానుతున్నాయి. మూడు రోజులుగా కృష్ణా నది ఉగ్రరూపం దాల్చటంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పొలాల్లోకి కృష్ణా నది వరద నీరు ప్రవేశించింది. 52 కిలోమీటర్లు పొడవైన నదీతీరం అచ్చంపేట మండలంలో ఉంది. మాదిపాడు నుంచి కస్తల గ్రామం వరకు నదీతీర గ్రామాల్లోని లోతట్టు పొలాలు మునిగి పోయాయి. తాడు వాయి వద్ద అడ్డవాగు పైకి కృష్ణా నది వరద నీరు ప్రవహిస్తుంది. మంగళవారం సాయంత్రం అడుగుకు పైగా బ్రిడ్జి పై నీరు చేరింది. ఇదిలా కొనసాగితే తాడు వాయి వద్ద రోడ్డు పైకి పూర్తి స్థాయిలో నీరు చేరే అవకాశం ఉంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి రూ 6.17 లక్షల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

టీడీపీ మండలాల అధ్యక్షులు వీరే

సత్తెనపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాలకు టీడీపీ నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రకటించారు. సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ళ అమరేశ్వరరావు, కార్యదర్శిగా కొదమల కోటేశ్వరరావు, రాజుపాలెం మండల అధ్యక్షుడిగా అంచు నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా వాసా పెద వెంకటేశ్వర్లు, నకరికల్లు మండల అధ్యక్షుడిగా వేల్పుల ఆవుల రాజు, ప్రధాన కార్యదర్శిగా మాలపాటి మహంకాళిరావు, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడిగా బత్తుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా తెల్లజర్ల వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడిగా షేక్ పెద మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శిగా నూర్ బాషా జానీ బాబులను ఎంపిక చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల అత్యుత్సాహం

● వరద ప్రవాహం సమీపంలో సెల్ఫీలు


వరద నీటికి అత్యంత చేరువగా పర్యాటకులు

విజయపురిసౌత్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలశయానికి ఎగువ నుంచి సుమారు 6 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండడంతో సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు అన్నింటిని ఎత్తి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పర్యాటకులు అధికంగా సాగర్‌ను తిలకించేందుకు వచ్చి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వరద ప్రవాహానికి అతి సమీపానికి వెళ్లి సెల్ఫీలు దిగుతున్నారు. గతంలో పలువురు దిగువ కృష్ణానదిలోకి దిగి ప్రవాహానికి కొట్టుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.92,700

విజయపురిసౌత్ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు మంగళవారం పర్యాటకులు పోటెత్తారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం సందర్శించారు. అనుపులోకి అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచేత్యము, యాంపి థియేటర్, శ్రీరంగనాథస్వామి ఆలయం వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా రూ.92,700 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.


ట్రూ అప్ చార్జీలు తగ్గించటంతో ఊరట

● రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ట్రూ అప్ చార్జీలు తగ్గించటంతో విద్యుత్ వినియోగదారులకు ఊరట లభించిందని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ట్రూ అప్ చార్జీలతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించి మాట నిలబెట్టుకుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి, ఓర్సు ఆనంద్, గుడిసె కొండయ్య, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ ఇబ్రహీం, పీఎస్‌కే రసూల్, ఎన్.పిచ్చయ్య, డీలర్ సుభానీ, వెంకటేష్, కొండవీటి అహమ్మద్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

బెల్లంకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. నరసరావు పేటకు చెందిన రామలింగారెడ్డి విజన్ హాస్పటల్ సహకారంతో బెల్లంకొండలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బెల్లంకొండ టీడీపీ నాయకుడు కోమటిగుంట షేక్ ఇబ్రహీం, మిసైల్స్ మ్యాన్ ఎడ్యుకేషన్ యూత్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ గౌస్ సంధాని ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారికి నరసరావుపేటలోని హాస్పటల్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తున్నట్టు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ వైస్ సర్పంచ్ కొండవీటి షేక్ రజాక్, హాస్పటల్ సిబ్బంది, కో-ఆర్డినేటర్ వీరయ్య, పాతిమా, బ్రహ్మ, వంశీ పాల్గొన్నారు.







ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 1 అక్టోబరు 2025

నేటి అలంకారం
శ్రీ మహిషాసురమర్దిని
ఆశ్వయుజ శుద్ధ నవమి (మహర్నవమి) బుధవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. అమ్మవారి నవఅవతారాల్లో మహిషాసుర మర్దినిని మహోగ్రరూపంగా భావిస్తారు. అమ్మ మహిషాసురుడిని సంహరించిన ఆశ్వయుజ శుద్ధ నవమిని 'మహర్నవమి'గా జరుపుకొంటారు. 'చండీ సప్తశతి' ప్రకారం దుర్గాదేవి అష్టభుజాలతో, సింహవాహినిగా మహిషాసురుడి సేనాపతులైన చిక్షురుడు, చామరుడు, ఉదగ్రుడు, బాష్కలుడు, బిడాలుడు తదితర రాక్షసులందర్నీ సంహరించింది. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో అవలీలగా మహిషాసురుణ్ణి



చంపి, అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రి మీద స్వయంభువుగా వెలసింది. సింహవాహనాన్ని అధిష్ఠించి, ఆయుధాలను ధరించిన ఆమె సకల దేవతల అంశలతో మహాశక్తి స్వరూపంగా దర్శనమిస్తుంది. ఈ తల్లిని పూజిస్తే సర్వ దేవతల అనుగ్రహం కలుగుతుందంటారు. మహిషాసురమర్దిని ఆరాధన వల్ల భయాలన్నీ తొలగిపోతాయనీ, శత్రు పరాజయం కలుగుతుందనీ, అంతఃశత్రువులు కూడా నశిస్తాయని, ధైర్యం కలుగుతుందనీ, సర్వ కార్యాల్లో విజయం సిద్ధిస్తుందనీ భక్తుల నమ్మకం.

దుర్గా నవరాత్రులు

నైవేద్యం :
బెల్లపు అన్నం, పులిహోర, గారెలు, పాయసం, అప్పాలు

అలంకరించే చీర రంగు :
గోధుమ, ఎరుపు

అర్చించే పూలు :
తామర పుష్పాలు, ఎర్రటి అక్షతలు

పారాయణ చెయ్యాల్సింది :
శ్రీ మహిషాసురమర్దినీ స్తోత్రం

స్ఫూర్తి



కండరాల బలహీనత చక్రాల కుర్చీకే పరిమితం చేసింది. ఏ పనీ సొంతగా చేసుకోలేని పరిస్థితి. ఆఖరికి దుస్తులు ధరించాలన్నా వేరొకరి సాయం తప్పనిసరైంది. ఈ అసౌకర్యానికి చెక్ పెడుతూ... తనలాంటివారి కోసం వినూత్న డిజైన్లు రూపొందించారు సౌమిత బసు. అమ్మ అండతో 'జైనికా' పేరుతో ఒక సంస్థ నెలకొల్పి... వైకల్యంగల వారికే కాకుండా వృద్ధులకు సైతం సులువుగా ధరించగలిగే సౌకర్యవంతమైన వెరైటీలు అందిస్తున్నారు.

స్టయిలిష్‌గా!

"కష్టాలు అందరికీ ఉంటాయి. జీవితమన్నాక పరీక్షలు ఎదురవుతుంటాయి. వాటిని తట్టుకొని ముందుకు సాగితేనే కదా బతుకు బండి నడిచేది. ఒక లక్ష్యం... దాన్ని సాధించాలన్న పట్టుదల ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చు. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా మహానగరం మాది. బాల్యం సంతోషంగా సాగిపోయింది. కానీ కాలేజీలోకి అడుగుపెట్టాక పెద్ద కుదుపు. కండరాల బలహీనతతో శరీరం క్రమంగా నా ఆధీనం కోల్పోతూ వచ్చింది. నా దుస్తులు నేను వేసుకోలేను. షర్ట్ బటన్స్ పెట్టుకోవడం కూడా కష్టమైపోయింది. రోజురోజుకూ పరిస్థితి క్షీణిస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా నైట్ డ్రెస్‌ల్లోనే. కొన్నాళ్లకు చక్రాల కుర్చీ నాకు ఆధారమైంది. అప్పటికి ఎనభై శాతం శరీరంలో కదలికలు తగ్గిపోయాయి. అమ్మ అమిత తోడుగా ఎలాగో నెట్టుకొచ్చాను.

ఆలోచన మార్చింది...

జీవితాంతం ఇలా వీల్‌ఛైర్‌లోనే గడపక తప్పదని నాకు అర్థమైంది. అలాంటప్పుడు ఎంతకాలం ఒకరిపై ఆధారపడాలి? ఇది నన్ను తీవ్ర ఆలోచనలోకి నెట్టింది. ముఖ్యంగా దుస్తులు ధరించడంలో ఉన్న ఇబ్బందులను అధిగమించాలనే నిర్ణయానికి వచ్చాను. ఎందుకంటే మాలాంటివారే కాదు, వెన్నెముక గాయాలు, ఇతర దీర్ఘకాలిక నొప్పులు భరిస్తున్న వారు సులువుగా వేసుకోవడానికి వీలైన వస్త్రశ్రేణులు ఎక్కడా కనిపించలేదు. కనుక నేను దానిపైనే దృష్టి పెట్టాను. అమ్మతో కలిసి ప్రయోగాలు ప్రారంభించాను.



ఆ స్వేచ్ఛ ఇవ్వాలని...

నా ఆకాంక్ష ఏంటంటే... నాలాంటి వారికి నచ్చిన దుస్తులు సులభంగా ధరించగలిగే స్వేచ్ఛ ఇవ్వడం. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపడం. అందుకు తగిన డిజైన్ల రూపకల్పనకు నేను, అమ్మ నిరంతరం ప్రయత్నించాం. ఒకటా రెండా... లెక్కలేనన్ని ప్రయోగాలు చేశాం. టైలర్లను, డిజైనర్లను కలిశాం. అంతర్జాలంలో అధ్యయనం చేసి, సొంతంగా తయారు చేశాం. కుట్టిన డ్రెస్ సౌకర్యంగా ఉందా లేదా అన్నది నేను ధరించి చూశాను. చివరకు మా శ్రమ ఫలించింది. మాగ్నెటిక్, వెల్క్రో క్లోజర్స్ నో బెండ్ ట్రౌజర్లు వంటివి రూపొందించాం. అంతేకాకుండా... కస్టమర్లు కోరిన విధంగా, వారి శరీర కదలికలకు తగిన వస్త్రశ్రేణులు అందించాం. అదికూడా స్టైలిష్ డిజైన్లలో. ఇది అద్భుతమైన ఫలితాలు ఇచ్చింది.

అంతా మావెంటే...

అందరికీ అందుబాటులో ఉండేలా 2020లో 'జైనికా' పేరుతో ఒక సంస్థ నెలకొల్పాం. అప్పుడు మావద్ద ఉన్నది 21 వేల రూపాయలు. దాంతోనే పని ప్రారంభించాం. ఆరంభంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయి. అయితే మా తల్లీకూతుళ్ల ప్రయత్నాన్ని చూసి చుట్టుపక్కలవారు ఎంతో ప్రోత్సహించారు. కొన్ని ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్థిక సాయం అందింది. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. దాంతో మార్కెటింగ్ కూడా సులువైంది. వారందరి సహాయ సహకారాలతో తక్కువ సమయంలోనే మా ఉత్పత్తులు దేశంలోని ఇతర ప్రాంతాలవారికి కూడా పరిచయమయ్యాయి. క్రమంగా ఆదాయం పెరిగింది. ఇది స్వశక్తితో మేం సాధించిన విజయం అనే కన్నా... ఒక కుటుంబంలా ఊరంతా కలిసి వచ్చి నిలబెట్టిన సంస్థ అంటేనే సబబుగా ఉంటుంది.

మరికొంతమందికి...

మా సంస్థలో పని చేసేవారు కూడా వైకల్యంగలవారే. ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా వందల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఇంటివద్ద నుంచే పని చేసే అవకాశం కల్పించాం. దానివల్ల వారికి ఆర్థిక స్వేచ్ఛ లభించింది. 'మేమూ స్వశక్తితో జీవించగలం' అనే నమ్మకాన్ని ఇవ్వగలిగాం. అందుకే చెబుతున్నా... నేను వారిని సాధికారత వైపు నడిపించడం కాదు, వాళ్లవల్లే నేను సాధికారత సాధించగలిగాను. నాలాగా చక్రాల కుర్చీలో అవస్థలు పడుతున్న ఒక మ్మాయి... 'ఇప్పుడు నా అంతట నేను కుర్తా ధరించగలుగుతున్నా. థ్యాంకూ' అని అంది. ఆ మాటలకు నా కళ్లు చెమర్చాయి. నిత్యం ఇలా ఎంతోమంది సందేశాలు పంపుతుంటారు. అవి చూసినప్పుడు నా వైకల్యాన్ని మరిచిపోతాను. ఆనందంతో ఉప్పొంగిపోతాను.

అదే నా కోరిక...

మా సంస్థను మరింత విస్తరించాలి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోని వారికీ చేరువ చేయాలి. ఏ ఒక్కరూ నాలాగా బాధపడకూడదు. ఇదే నా సంకల్పం. ఏదిఏమైనా చిన్న మొత్తంతో ప్రారంభించిన మా వ్యాపారం ఇప్పుడు లాభదాయకంగా సాగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కోటిన్నర రూపాయల టర్నోవర్ సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. అది నెరవేరుతుందని ఆశిస్తున్నాం."

'నిన్ను తొలిచూపులోనే ప్రేమించేశా' అన్నప్పుడు అతన్ని నమ్మలేకపోయింది. 'డేటింగ్ చేయను పెళ్లాడతా' అన్నప్పుడు కాస్త మెత్తబడింది. 'అందర్నీ ఒప్పించి పెళ్లాడతా' అన్నప్పుడు మరో ఆలోచన లేకుండా పెళ్లికి తల వంచేసింది. అలా వెంటపడి, పట్టుబట్టి పెళ్లాడిన అబ్బాయి 'నికొలస్' అమెరికన్ అయితే, అతన్ని తొలి చూపులోనే గెలుచుకున్న మన తెలుగమ్మాయి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ 'శ్వేత' కావడం విశేషం. ఊహకందనంత వేగంగా మలుపు తిరిగిన తన జీవితం గురించీ, తెలుగు భాషనూ, వంటలనూ, సంప్రదాయాలనూ ఇష్టపడే భర్త నిక్ గురించి, టెక్సాస్‌లో స్థిరపడిన 'రమిణి శ్వేత నికొలస్ అర్నీని' నవ్యకు ఇలా వివరించింది...



పడమట శ్వేతా రాగం

అమెరికాలో చదువు అనగానే, అది సంపన్నులకే సాధ్యపడుతుందని అనుకుంటారు. కానీ నేను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎలాగైనా అమెరికాలో ఉన్నత చదువు చదవాలనే కోరిక బలంగా ఉండేది. కానీ నాన్న అందుకు ఒప్పుకోరు. ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే కాబట్టి కలను నిజం చేసుకోవాలంటే కష్టాన్నే నమ్ముకోవాలని నిర్ణయించుకున్నాను. అలా పగటి వేళను చదువుకూ, రాత్రివేళను ఉద్యోగానికీ కేటాయించాను. కొద్దికొద్దిగా డబ్బు కూడబెట్టుకుంటూ, సాధ్యమైనంతగా పొదుపు చేసుకుంటూ క్యాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీలో ఎమ్‌బిఏ చదువు కోసం దరఖాస్తు చేసుకున్నాను. మొదటి ప్రయత్నంలోనే సీటొచ్చేసింది. అయితే వీసా వచ్చేవరకూ ఇంట్లో చెప్పకూడదని అనుకున్నాను. అలా వీసా వచ్చిన తర్వాత ఇంట్లో చెప్పినప్పుడు అమ్మా నాన్న నిర్ఘాంతపోయారు. నిజానికి వీసా ఖర్చులకూ, ఫ్లైట్ టిక్కెట్‌కు అవసరమైన డబ్బును మాత్రమే దాచలిగాను. ఆ తర్వాత ఏం చేయాలో స్పష్టత లేకుండానే ప్రయాణానికి సిద్ధపడిపోయాను. కానీ చివరి నిమిషంలో అమ్మ మొదటి సెమెస్టర్‌కు అవసరమైన డబ్బును సమకూర్చి అందించింది. అలా ఓ పక్క భయంతో, మరోపక్క ఆనందంతో 2014లో అమెరికాలో అడుగుపెట్టాను. చదువు సాగినంత కాలం సొంత ఖర్చులు, చదువు కోసం రేయింబవళ్లూ కష్టపడ్డాను. సబ్‌వే రెస్టారెంట్లు, ఇండియన్ రెస్టారెంట్లు... ఇలా వీలున్న ప్రతి చోటా ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటలవరకూ 12 నుంచి 14 గంటల పాటు పని చేశాను. అలా ఇంట్లో ఒక్క రూపాయి అడగకుండా చదువు పూర్తి చేయగలిగాను. కొన్నిసార్లు ఇంటికి కూడా డబ్బు పంపించాను. అలా చివరకు 2016లో ఐటి సబ్జెక్టు కలిగిన ఎమ్‌బిఏ డిగ్రీ సాధించాను. ఆ తర్వాత ఏడాదిలోపే శామ్‌సంగ్‌లో ఉద్యోగం వచ్చేసింది. మొదటి ఉద్యోగం బోస్టన్‌లో. దగ్గర్లోని మాంచెస్టర్‌లో ఉన్న స్నేహితురాలిని తరచూ కలుస్తూ ఉండేదాన్ని. 2019లో ఓ పుట్టిన రోజు వేడుక కోసం మాంచెస్టర్ బయల్దేరినప్పుడు, అక్కడొక అద్భుతమైన వ్యక్తిని కలవబోతున్నట్టు నాకు తెలియదు.

తొలిచూపులోనే ప్రేమ

ఆ పార్టీలో నికొలస్ తప్ప మిగిలిన వాళ్లందరూ భారతీయులే! దాంతో నా స్నేహితులందరూ నిక్‌ను చుట్టుముట్టి అతన్ని సరదాగా ఆట పట్టించడం మొదలుపెట్టారు. నేను స్వతహాగా సిగ్గరిని కాబట్టి అదేమీ పట్టించుకోకుండా ఓ సోఫాకి పరిమితమై కూర్చుండిపోయాను. కానీ నిక్ అంతమంది అమ్మాయిలను వదిలేసి నా దృష్టిలో పడే ప్రయత్నం చేస్తూ, మాటలు కలపడం మొదలుపెట్టాడు. మొదట్లో భయపడి, దూరంగా పారిపోయాను. ఆ తర్వాత ఇంట్లో నాకు పెళ్లి ప్రయత్నాలు జరుగుతున్నట్టు స్నేహితుల ద్వారా తెలుసుకున్న నిక్, నన్ను ఇష్టపడుతున్నట్టు చెప్పి, ఒక కాగితం మీద తన ఫోన్ నంబర్ రాసిచ్చి వెళ్లిపోయాడు. ఆ తర్వాత నా స్నేహితులు నన్ను అనుకరిస్తూ, నా ఫోన్ నుంచి అతనికి మెసేజెస్ పెడుతూ అతన్ని లంచ్‌కి పిలిచారు. ఆ లంచ్‌లో నిజం తెలిసినప్పటికీ, ఆయన ఏమాత్రం కోపగించుకోకుండా, నేరుగా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. కానీ తర్వాత ఆలోచించి, అతని ప్రేమను, ప్రపోజల్‌నూ అంగీకరించాను. ఆ తర్వాత రెండు వారాలకే మా పెళ్లి జరిగిపోయింది. నిజానికి మా పెళ్లికి ఎంతోమంది ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ అమ్మ మాత్రం, 'నువ్వు ప్రేమించే వ్యక్తికి బదులుగా, నిన్ను ప్రేమించే వ్యక్తిని చేసుకుంటే సుఖపడతావు' అంటూ ప్రోత్సహించింది. అమ్మ చెప్పిందే నిజమైంది.



మాది హైదరాబాద్. అక్కడే పుట్టి పెరిగాను. నాన్న రామకృష్ణ ఫైనాన్స్ బిజినెస్ చేస్తారు. అమ్మ సంధ్యారాణి ప్రస్తుతం గృహిణి. భర్త నిక్, సైన్యంలో ఐటి డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. ప్రస్తుతం నేను యుఐ డెవలపర్‌గా ఇంటి నుంచే పని చేస్తున్నాను. మాకు ముగ్గురు పిల్లలు. మొదటి బాబు అయాన్ష్‌కు నాలుగేళ్లు. రెండో వాడు, అరిహాన్‌కు రెండేళ్లు. పాప ఆష్నాకు ఏడాది వయసు. నాకొక అక్క కూడా ఉంది. పేరు దివ్య. తాను కూడా ఇక్కడే స్థిరపడింది.

కొడుకు లేని లోటు తీర్చి...

నిక్ జీవితం, నా జీవితం ఒకలాంటివే! జీవితంలో పైకి ఎదగడం కోసం నేనెన్ని కష్టాలు పడ్డానో, నిక్ కూడా అంతకంటే ఎక్కువ కష్టాలే పడ్డాడు. 13 ఏళ్ల వయసులోనే తల్లితండ్రులను కోల్పోవడంతో మంచి కుటుంబం కావాలని కోరుకున్నాడు. మా అమ్మానాన్నలను తన అమ్మానాన్నల్లా ప్రేమించాడు. ఎంతో ఆప్యాయంగా ఆదరించాడు. అన్నిటికంటే ముఖ్యంగా ఆయనకు మన తెలుగు భాష, సంప్రదాయాలు, వంటలంటే ఎంతో ప్రాణం. ఇంట్లో పిల్లలతో తెలుగులోనే మాట్లాడమంటాడు. టీవీలో కూడా తెలుగు కార్యక్రమాలే చూపించమంటాడు. తాను కూడా కష్టపడి తెలుగు నేర్చుకున్నాడు. ప్రస్తుతం కొద్దికొద్దిగా మాట్లాడగలుగుతున్నాడు. ఓసారి నాకు తెలియకుండానే అమ్మానాన్నలను అమెరికాకు పిలిపించి నన్ను సర్‌ప్రైజ్ చేశాడు. అమ్మను షాపింగ్‌కు తీసుకువెళ్లి నచ్చినవన్నీ కొనిపెట్టాడు. చెప్పుల షాపులో అమ్మ కాళ్లకు తానే స్వయంగా బూట్లు తొడిగినప్పుడు మా అందరి కళ్లూ చెమర్చాయి. ఫోన్లో గూగుల్ ట్రాన్స్‌లేటర్ ఇన్‌స్టాల్ చేయించి, దాన్నెలా వాడుకోవచ్చో అమ్మకు నేర్పించాడు. అలా అమ్మా, నిక్ ఎంతో బాగా కలిసిపోయారు. కొడుకు లేని లోటు తీర్చాడని అమ్మ ఎంతో మురిసిపోతూ ఉంటుంది. మనది వినూత్నమైన జంట అంటూ నా చేత ఇన్‌స్టా అకౌంట్ క్రియేట్ చేయించాడు. అకౌంట్ క్రియేట్ చేసిన రెండు నెలలకే ఏకంగా 27 వేల మంది ఫాలోవర్లను సంపాదించుకోగలిగాం! కొందరు ప్రముఖులు మా జంటను అభినందిస్తూ మెసేజ్‌లు పెట్టారు.



• గోగుమళ్ల కవిత

పిల్లలు కూరగాయలు తినట్లేదా?

పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తాజా కూరగాయలు ఎంతగానో దోహదం చేస్తాయి. కానీ వీటిని తినడానికి పిల్లలు అసలు ఇష్టపడరు. అలాంటప్పుడు పిల్లలచేత రకరకాల కూరగాయలను ఎలా తినిపించాలో తెలుసుకుందాం...



- కీర, కేరట్, బీట్‌రూట్‌లను నక్షత్రాలు, హార్ట్, స్మైలీ ఫేస్ లాంటి ఆకర్షణీయమైన ఆకారాల్లో కోసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు
- కూరగాయల ముక్కలు లేదా వాటి తురుమును చేర్చి తయారుచేసిన ఇడ్లీ, దోశ, చపాతీలను పిల్లలకు తినిపించవచ్చు.
- కూరగాయల ముక్కలు, కొత్తిమీర, పుదీనా చేర్చి రుచికరమైన స్ప్రింగ్‌రోల్స్ తయారుచేసి ఇస్తే పిల్లలు చక్కగా తింటారు.
- పాలకూర, మెంతికూర లాంటి ఆకుకూరలను సన్నగా తరిగి గోధుమపిండిలో కలిపి తయారు చేసిన రోటీలను అల్పాహారంగా పిల్లలచేత తినిపించవచ్చు.
- కూరగాయలను వండేటప్పుడు వాటిని శుభ్రం చేయడం, సన్నగా తరగడం, వండడం లాంటి పనులను పిల్లలతో కలిసి చేయాలి. క్రమంగా ఆ వంటకాలను తినాలనే ఆసక్తి పిల్లల్లో ఏర్పడుతుంది.
- కుటుంబసభ్యులంతా కలిసి తరచూ వెజిటబుల్ సలాడ్‌ను తింటూ వుంటే పిల్లలకు కూడా దాన్ని తినాలనే కోరిక కల్గుతుంది.

ఫ్యాషన్



ప్రతి పండుగకూ పట్టుచీరేనా? ఇంకేదైనా వెరైటీ చీర కట్టుకుందామా? అని ఆలోచించే మహిళలు నిస్సందేహంగా జందానీ చీరను ఎంచుకోవచ్చు. ఆకట్టుకునే రంగుల్లో, సౌకర్యవంతంగా ఉండే జందానీ సొగసులు ఇవే!

జందానీ జబర్దస్త్

జందానీ అసలు పేరు 'ఢకాయి'. ఢాకా నగరం నుంచే ఈ పేరొచ్చింది. ఈ అద్భుతమైన చీరలు ఢకాయి జందానీ లేదా ఢకాయి అనే పేరుతో ప్రజాదరణ పొందాయి. జమ్దాని అనే పదం మూలాలు పర్షియాలో ఉన్నాయి. బెంగాలీ చేనేత కళాకారులు జందానీ నేత పనితనాన్ని పెంపొందించుకున్నారు.

- మోటిఫ్స్, తయారీ ప్రాంతం ఆధారంగా జందానీ చీరలను వర్గీకరిస్తారు. పన్నా హజార్ లేదా వెయ్యి పచ్చలు, కల్కా లేదా పెయిస్లీ, బుటిదార్ లేదా చిన్న పువ్వులు, ఫుల్వార్, టెర్స్, జలాల్, డురియా, కర్కీనా మోటిఫ్స్ అత్యంత ఎక్కువగా ప్రజాదరణ పొందాయి
- గతంలో జందానీ చీరలు కేవలం రాజ కుటుంబాలకే పరిమితమై ఉండేవి.

కానీ నేడు ఫ్యాషన్‌ను ఇష్టపడే మహిళలందరూ ఈ చీరల మీద మక్కువను ప్రదర్శిస్తున్నారు. కుటుంబ వేడుకలు, పండుగల్లో ఈ చీరలకే పెద్ద పీట వేస్తున్నారు

- బంగ్లాదేశ్‌లో రూపొందే ఢకాయి జందానీ చీరలు, తంగాయి జిల్లాలో రూపొందిన జందానీ చీరలు పెద్ద బార్డరును కలిగి ఉండి, పద్మం, దీపం, చేప పొలుసుక మోటిఫ్స్‌ను కలిగి ఉంటాయి. హుందాగా కనిపించే ఈ చీరలు సాయంకాలం వేళ వేడుకలకు అనువుగా ఉంటాయి
- తేలికపాటి ఆభరణాలు జందానీ చీరలకు ఎంతో బాగా నప్పుతాయి. అలాగే ఆక్సిడైజ్డ్ సిల్వర్ జ్యువెలరీ కూడా ఈ చీరలకు ఎంతో బాగా నప్పుతుంది.

